# మౌనమే నీ భాష..!

## -ఉరిటి సులేఖ

నల్లటి ముఖమల్ దుప్పటిపై కుట్టిన అద్దాల్లా తళుక్కుమంటూ నక్షత్రాలు ఆకాశం నిండా.

వెన్నెల సంచి నిండా రవ్వల్ని నింపి నింగిని దాటుతోన్న నెలవంక, నట్టడివి మొగలిపువ్వు ఓరచూపుకి మనసు పారేసుకుని రవ్వల్ని జార్చేసినట్లు ఊరవతలి అరణ్యం నిండా వెండి వెలుగు.

ఇదంతా నా కల్పనే కావచ్చు. కానీ ఈ రాత్రిపూట ఆకాశం ఎందుకనో అందంగా అన్పిస్తోంది.

బహుశా నీ నిశ్శబ్ద పిలుపువల్లే కావచ్చు. అసలు నాకేమనిపిస్తోందో తెల్సా, సృష్టికర్త మొట్టమొదటిసారిగా నిశ్శబ్దాన్నే సృష్టించాడేమో!

శీతాకాలపు ఉదయపు నీరెండలో వెచ్చదనంలా నీ పిలుపు.

వేసవి సాయంకాలపు సమీరంలా గిలిగింతలు పెడుతూ నీ పిలుపు.

లేత వానాకాలపు చినుకు, చినుక్కీ మధ్య విరహంలా గమ్మత్తుగా నీ పిలుపు.

అది నీ గుండె గొంతుక నుండి నన్ను మాత్రమే తాకడానికి ఉదయిస్తోన్న నిశ్శబ్దమైన శబ్దమని.

ఈమధ్య ఇంట్లో గొడవలెక్కువవుతున్నాయి. ఎప్పట్లానే అమ్మ తిడుతోంది నాన్న లేకపోవడం చూసి.

అమ్మ సవతి తల్లయినా నాకు ఊహ తెలిసినప్పటి నుండీ ఆమెని తల్లిగా నేనెరుగుదును. ఆమె ఎంత కోపగించుకున్నా నేనెప్పుడూ ఆమె మాటని అతిక్రమించలేదు.

ఉదయం వంటచేసి టేబుల్ మీద అన్నీ సర్దేసి కాలేజీకని బయలుదేరాను. అమ్మ హార్లిక్స్ కలపమంది. నాకు టైమవుతోంది. ఆలస్యమైతే బస్సులు దొరకవు. నేనేం చెప్పినా ఆవిడకి అర్థంకాదు. కనీసం అర్థం చేసుకోవడానికి ప్రయత్నించదు.

త్వరత్వరగా హార్లిక్స్ కలిపి ఆవిడకి అందించాను. అంతలో ఫోన్ రింగయింది. అది నీ పిలుపే అని నాకు తెల్సు. అందుకే అవ్యక్తానందంతో రిసీవర్ తీసుకున్నాను.

ఎప్పట్లానే అనంత నిశ్శబ్దం. ఫోన్ తీగకి ఆ చివర నీవు, ఈ చివర నేను. మనిద్దర్నీ కలుపుతూ మౌనమైన అనురాగం.

నువ్వు క్రెడిల్ చేసిన శబ్దం విని నేను రిసీవర్ పెట్టేశాను. నా ముఖకవళికల్నిబట్టి అమ్మకి అర్థం అయిందనుకుంటాను. అది నీ పిలుపే అని అందుకే అమాంతం మింగేసేట్టు నన్ను చూసింది.

క్షిపణుల్లాంటి ఆ చూపులంటే నాకు చచ్చేంత భయం. అందుకే వెళ్తానన్నట్లు కళ్లతోనే చెప్పి బయట పడ్డాను.

★★★

కోతలికి సిద్ధంగా వున్న వరిచేలలా నిండుగా కదుల్తున్నాయి నల్లమబ్బులు.

దక్షిణపు గాలి సోకగానే కలవరంగా కదిలింది కరిమబ్బు. అది మెరుపువీరుని రాకను తెలిపే సంకేతం కాబోలు. క్షణాల్లో నింగి మెరిసింది.

ప్రియుని కౌగిట్లో కరిగి పులకించిన నీటిమబ్బు తుళ్లింత జల్లులా!

పల్చటి పట్టుపరదాలా వానజల్లు నీకూ నాకూ మధ్య.

సైన్స్ సాధించిన విజయాలన్నింటిలోనూ ఫోన్‌ను కనిపెట్టడమే అత్యుత్తమ విజయం అని నాకన్పిస్తుంది.

రోజూ నేను నిద్రపోయేటప్పుడు గ్రాహంబెల్‌కి థాంక్స్ చెప్తాను తెల్సా!

ఇప్పటికిప్పుడే నీతో మాట్లాడాలి. కానీ ఎలా? అసాధ్యం కదూ? అందుకే టేప్ ఆన్ చేశాను. ఈమధ్య వస్తున్న కొత్త పాటల లిరిక్స్ బాగుంటున్నాయి. మార్దవంగా కుమార్‌సాను గొంతు. ఆ పాటని మన కోసమే రాశారేమో అనిపిస్తుంది.

నేను నీకు రింగ్ చేశాను. ఆ సమయంలో రిసీవ్ చేసుకునేది నీవే. అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలనో తెల్సా? నీ హార్ట్‌వేవ్ లెంగ్త్ నాకు తెల్సు. నువ్వు పాట విన్నావు నాతోపాటే. అఫ్‌కోర్స్! కొద్దిసేపే అయినా ఆ అనుభూతి చాలు.

అమ్మ నిద్రపోతోంది. ఆమె అదో టైప్. వైరైటీ మనుష్యులు కదూ? లేకపోతే ఇంత చక్కటి వర్షాన్ని ఎట్లా మిస్ చేసుకుని నిద్రపోతుంది?

ఒక్కోసారి నాకెంత సంతోషం వస్తుందో తెల్సా? నేను పీలుస్తున్న గాలినే నువ్వూ పీలుస్తున్నావు. నేను తాగుతున్న నీటినే నువ్వూ తాగుతున్నావు. అదిగో అట్లాంటి భావం కల్గుతుంటే ఇహపరాల్లోనూ నీలోనే మమేకమైననట్టు! అప్పుడు వాననీటిలో కాయితప్పడవల్ని వదిలినంత హాయిగా అన్పిస్తుంది.

★★★

ఎందుకనో ఈ పూటంతా నీ జ్ఞాపకాల దొంతర్లే. నందివర్ధనం నునుపులా శాంతంగా నీ చూపు. పాదరసం మెరుపులా చురుగ్గా నీ చూపు కల్నేతలా కలసిపోయి నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

అవును నాకర్థంకాక అడుగుతున్నా, నువ్వు ఫోన్ చేస్తే నేను మాట్లాడను. అదిసరే. నా పరిస్థితి అలాంటిది. నువ్వు కూడా మాట్లాడవేం? కనీసం వింటాను కదా!

అసలు నిన్నంతా నీకేమైంది? ఒక్క కాల్ కూడా చేయలేదు. ఊర్లో ఉన్నావా? లేదా? అన్న అనుమానంతో మా కాలేజీ అయినాక మీ ఆఫీసుకు వచ్చాను. రోడ్డుమీద నుండే నువ్వు కన్పిస్తున్నావు కిటికీ వెనుక కంప్యూటర్ ముందు. నాకు ఒళ్లు మండింది. నువ్వు నన్ను చూడలేదు. నేను కోపంగా ఇంటికి వచ్చేశాను. ఎంతసేపనీ, కొద్దిసేపే. అమ్మా నాన్నా ఏదో సీరియస్‌గా మాట్లాడుకుంటున్నారు. నేనా గదికి వెళ్లలా!

ఫోన్ ముందు కూర్చుని నీకోసం ప్రయత్నిస్తున్నా-ఎంతసేపనీ, పదిహేన్నిముషాలసేపు అస్సలాపకుండా. ప్చ్... లాభం లేకపోయింది. ఎవరూ ఫోన్ పికప్ చేయలేదు. ఎందుకని? నువ్వీ టైమ్‌లో ఇంట్లోనే ఉంటావే. నామీద కోపమా? ఏమైంది? ఆ రాత్రంతా నిద్ర పట్టలా. మర్నాటి ఉదయానికల్లా నీమీద కోపం పటాపంచలైంది.

నా మొద్దు మొహానికి తట్టనేలేదు. మీ ఫోన్ డెడ్ అయిందికదూ. కంప్లైంట్ ఇద్దామనుకున్న. కానీ ఎలా? అస్సలు కుదర్దు. పోనీ నువ్వే ఇవ్వొచ్చుగా? ఇచ్చే వుంటావులే. నా పిచ్చిగానీ ఇంతవరకూ ఇవ్వవా?

ఇప్పుడు నువ్వింట్లో ఉండవని తెలుసు. మాకీరోజు కాలేజీ సెలవు. అందుకే ఫోన్ చేసా. మీ అమ్మగారనుకుంటాను రిసీవ్ చేసుకున్నారు. అట్లా అనుకుంటే సుఖంగా వుంటుంది. ఒక్కోసారి నీ భార్యేమో అన్పిస్తుంది. అమ్మో ఆ ఆలోచనే నాలో పాల్పిటేషన్!

అసలు నీకు పెళ్లయిందా? నీ పేరేంటి? ఊరేంటి?

ఏమో అవన్నీ నాకనవసరం. నాక్కావాల్సిందల్లా నా హృదయాన్ని ఊయలలూపే నీ బ్లాంక్ కాల్. నువ్వేం మాట్లాడనక్కర్లా. నేను గుర్తొస్తున్నాననడానికి సాక్షిగా ఒక్క నిశ్శబ్ద పిలుపు. అది చాలు ఈ జీవితం ధన్యమవడానికి.

మీ అమ్మగారు రిసీవ్ చేసుకున్నాక నేను క్రెడిల్ చేశాను. అంటే మీ ఫోన్ పని చేస్తోందేమో. థాంక్‌గాడ్!

మీ ఫోన్ డెడ్ అయినప్పుడు నాకేమనిపించిందో తెలుసా? ప్రపంచం అంతా చచ్చిపోయి అంత ప్రపంచంలోనూ కేవలం మనిద్దరమే ఉండి, ఆ ఉండడం కూడా ప్రపంచానికి ఆ అంచున నువ్వు, ఈ అంచున నేను అయిపోయి కలవడానికి మనసు తప్ప వేరే సాధనమేంలేక ఒంటరిగా మిగిలిపోయినట్టు!

ఇప్పుడల్లాంటి అడ్డంకులేం లేవు. నాకెంత ఉత్సాహంగా ఉందో, కొండ వెనుక మనోరంజనీ పూలని ఏరుకుంటూ తెచ్చినంత!

★★★


ఈరోజు నాకు పెళ్లిచూపులు. అందుకే వారంక్రితం అమ్మా నాన్న రహస్యంగా మాట్లాడుకున్నారు అనుకుంటా.




పెళ్లివారు వచ్చారు. వాళ్లముందే ఫోన్ రింగవుతోంది. అప్పటికప్పుడే పరిగెత్తుకువెళ్లి నీ పిలుపుని రిసీవ్ చేసుకోవాలని ఉంది. అతి కష్టంమీద ఆగాను. నాన్న ఫోన్ తీశారు. నాకు తెలుసు నాన్న గొంతు విని నువ్వు మాట్లాడవని.

''డిస్‌కనెక్ట్ అయింది'' నాన్న జవాబు.

ఇంటి కెళ్లాక ఉత్తరం రాస్తానన్నారు పెళ్లివారు. నాకెందుకో భయంగా ఉంది. అబ్బాయి డైవోర్సీ అట. అమ్మ తెచ్చిన సంబంధం. నాకెంతమాత్రం ఇష్టంలేదు. అబ్బాయి ఉద్యోగం, హోదా, అందం నాన్నకి




నచ్చాయి. నాకు అంతకంటే గొప్ప సంబంధం రావడం కష్టంట. అంతా తీర్మానించేసారు.

★★★

చుట్టూరా చీకటి దిగుల్ని నింపుకుని అచ్చం నాకు మల్లే. నేవెళ్లిపోతా శాశ్వతంగా. నీకు చాలా చాలా దూరంగా. అస్సలస్సలు అందకుండా.

ఈ రోజెందుకో అనుమానం వస్తుంది. ఇంతకీ నాకీ బ్లాంక్‌కాల్ చేస్తోంది నువ్వేనా? లేకపోతే ఈమధ్య ఏవో త్రెటనింగ్ కాల్స్ వస్తున్నాయంటకదూ! అట్లాంటిదేనా ఇది కూడా.

ఏమో, ఏదయితేనేం, ఇంతకాలం అది నీ పిలుపే అనుకుంటూ తెగ సంబరపడిపోయాను.

చలం అన్నట్లు పార్క్‌లో ముడతలు పడ్డ ఎర్రకాయితం దూరం నుండి ఎర్ర గులాబీలా కన్పించి ఆనందంలో ముంచేస్తోంది.

అబద్ధం సృష్టించే మధురానుభూతి అట్లాంటిదే.

ఈమధ్య ఏదో పాటలో విన్నాను. నువ్వు ప్రేమించకపోయినా కనీసం నాకోసం ప్రేమించినట్టు నటించు ప్రియా అని వాపోతాడు ఆ ప్రియుడు.

ఆ సాయంత్రం బస్టాప్‌లో నీ చూపులు అందర్నీ వదిలేసి నాకోసం వెదుకుతున్నప్పుడు-

నీ ఫోన్ రాలేదని నేనలిగినవేళ, కాల్ చేసి నన్ను లాలిస్తున్నప్పుడు-

నా కాల్ని రిసీవ్ చేసుకుంటున్నప్పుడు సైతం అదే నిశ్శబ్దం నీ హృదయపు లోతుల్లో.

నా హృదయపు పియానో మెట్లపై నీ మౌనరాగం నిశ్శబ్దంగా అనురాగ శబ్దాన్ని పలికిస్తూ-

ఎన్నో ఎన్నెన్నో జ్ఞాపకాల్ని నాకు మిగిల్చేసి అసలేం జరగనట్టే నీ దరహాసం.

ఇంతకీ నువ్వెవరు? ఏమో నాకేం తెల్సు? తెలుసుకోవాలని లేదు. నువ్వే కేవలం నువ్వే నా నువ్వే నాక్కావాలి.

చిన్నప్పుడెప్పుడో చదువుకున్న 'వంకా జుకావ్' రష్యన్ కథ గుర్తొస్తోంది. తనని బానిసత్వం నుండి రక్షించమని తాతయ్యకి ఉత్తరం రాస్తాడు వంకా. ఉత్తరం నిండా మనసుని పిండేసే భావాలే. ఉత్తరాన్ని పూర్తిచేసి 'టు గ్రాండ్ ఫాదర్' అని చిరునామా రాసి పోస్టు డబ్బాలో వేసి హాయిగా నిద్రపోతాను. ఆ ఉత్తరం చేరేనా? నా హృదయ వేదనా అంతే.

అందుకే ఆఖరిసారిగా నీకు బ్లాంక్‌కాల్ చేస్తున్నా. ఈ సమయం నీది. తప్పకుండా నువ్వు ఫోన్ దగ్గరే ఉంటావు.

థాంక్‌గాడ్! దొరికేవు. నాకు తెల్సు నువ్వు మాట్లాడవు. అయినా అవధుల్లేని అంబరాన్ని దాటే పరవశం నాలో.

నీకు వీడ్కోలు చెప్పడానికే ఈ కాల్ అని తెలిస్తే తప్పకుండా మాట్లాడేవాడివే. కానీ ఈ పరిస్థితుల్లో ఏమీ చెప్పలేని నిస్సహాయురాలిని.

★★★

డైరీ పూర్తిచేసి ఆఖరిసారిగా అతన్ని చూడడానికి కాలేజీకి బయలుదేరిందామె. ఎప్పట్లానే అతడు కిటికీ వెనక కంప్యూటర్ ముందు.

కంప్యూటర్‌లో అక్షరాలు కదులుతున్నాయి.

'అయ్ లవ్ యు' చప్పుడు మార్చిన గుండెని పట్టించుకోకుండా నించుందామె.

ఆమె అలికిడికి తల తిప్పాడతడు.

ఆమె సడి మర్చిన కన్రెప్పల తడిలా అతని ప్రతిబింబం లీలగా కదుల్తూ. అతడామెని సమీపించాడు.

అతడికంటే ముందు నిశ్శబ్దం ఆమె నావరించింది.

ఆమె ఏం అడుగుతుందో అని అతడి ఆత్రం.

అతనికెలా చెప్పాలా అని ఆమె జంకు.

ఇద్దరి మధ్య ఆకాశమంత నిశ్శబ్దం.

శబ్దం నిశ్శబ్దంగా నిశ్శబ్దమై ఇరు హృదయాల్ని అతుక్కుని. వారికప్పుడు భాషతో పనిలేదు.

ప్రపంచాన్నంతా ఒకే తాటిపై నడపగల వసుధైక భాష ప్రేమ. ఆ భాషా ప్రవీణులు వారు. ఇరువురూ ఏకమయ్యారు.

మౌనమే నీ భాష ఓ మూగమనసా!

దానికి అక్షరాలు అక్కర్లేదు. భావాలు చాలు.


మాటలు అక్కర్లేదు, అనుభూతులు చాలు.

అప్పుడు గమనించిందామె.

అతని మూగభాషని కమనీయంగా చిత్రించే కంప్యూటర్‌ని.

సరిగ్గా అప్పుడే అతడు గమనించాడు. ఆమె చేతిలో పుస్తకంపై అంటించిన లేబుల్ని. శిల్ప, డెఫ్ అండ్ డంబ్ కాలేజీ లెక్చరర్.

మూగబోయిన ఆమె కంఠంమ్మీద నిశ్శబ్దంగా అతని అధరాలు ఐక్యమైపోతూ-



## పెళ్లికి ముందే హనీమూన్!

బోనీకపూర్, అనిల్ కపూర్‌ల ముద్దుల తమ్ముడు, ఫ్లాప్ హీరో సంజయ్ కపూర్ బ్రహ్మచారిగా ఇప్పటికే బాగా ముదిరిపోయాడని బాలీవుడ్ అంతా గగ్గోలు పెడుతున్నారని కాబోలు ఇక పెళ్లి చేసేసుకోవాలనే నిర్ణయానికొచ్చాడు. తన గాళ్ ఫ్రెండ్ మహీప్ సంధుని అతి త్వరలోనే పెళ్లి చేసుకోవాలనుకుంటున్నట్టు ఆమధ్య సెలవిచ్చాడు. పెళ్లి తేదీ ఎప్పుడో ఏంటో తెలియకపోయినా వాళ్ల హనీమూన్ మాత్రం ఎంచక్కా జరిగిపోయిందిట. ఈ ప్రేమ జంట పెళ్లికి ముందే ఇటీవల పారిస్ విహార యాత్ర చేసొచ్చారుట. అంటే పెళ్లికి ముందే హనీమూన్ అన్నమాటేగా! మరీ అంత తొందరేంటంట? అని సినీ జనాలు విస్తుపోతున్నారు ఈ సంగతి తెలిసి.

-జె.ఎం.